మళ్లీ పదేండ్ల నాటి దుస్థితి

హైదరాబాద్‌లో కరెంట్, తాగునీటి సమస్యలు తీవ్రం

అబద్ధాలతో అధికారంలోకి కాంగ్రెస్

- మతం పేరుతో బీజేపీ, మజ్లిస్ రాజకీయాలు
- గోషామహల్‌లో పేదలకు ఉచిత విద్య అందిస్తా
- హైదరాబాద్‌లో సదుపాయాలు మెరుగుపరుస్తా
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్, మే 10 : 'ఉమ్మడి పాలనలో హైదరాబాద్ నగరవాసుల సమస్యలు అన్నీఇన్నీ కావు.. కరెంటు ఎప్పుడుంటదో ఎప్పుడు పోతదో తెల్వక.. మంచినీళ్లు రాక ప్రజలు అరిగోస పడ్డరు. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని విధాలా సౌకర్యాలు కల్పించిండ్రు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ పదేండ్ల కింది దుస్థితి వచ్చింది. నగరంలో కరెంటు, తాగునీటి సమస్యలు తీవ్రమైనయ్' అంటున్నారు బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్. ప్రజలు తనను ఆదరించి ఎంపీగా అవకాశమిస్తే పార్లమెంట్ నియోజకవర్గంలో విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని, గోషామహల్ నియోజకవర్గంలోని నిరుపేదలకు ఉచితంగా విద్యా బోధన అందిస్తానని చెప్పారు. 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార తీరు, ప్రజాస్పందన, గెలిస్తే తాను చేపట్టబోయే పనులపై వివరించారు.

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ Special Interview

ఎన్నికల్లో బీజేపీ, మజ్లిస్ ప్రభావం ఎలా ఉండబోతున్నది?

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధానంగా మజ్లిస్‌తో పోటీ ఉంటుంది. ఆ పార్టీ నలభై ఏండ్లుగా నగరంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదు. ఇటు బీజేపీ అటు మజ్లిస్ రెండు పార్టీలు మతం పేరిట రాజకీయాలు చేస్తున్నయ్. పిల్లల మనసుల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నయ్. విద్య, వైద్యం, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి మతం పేరు చెబుతూ పబ్బంగడుపుతున్నయ్. ప్రజల్లో ఆ పార్టీలపై నమ్మకం పోయింది. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌నే గెలిపించేందుకు సిద్ధమైండ్రు.

మీ గెలుపు కోసం కలిసివచ్చే అంశాలేంటి?

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డరు. కరెంట్, మంచినీటి కోసం చాలా తిప్పలు పడ్డరు. బిందెలతో కిలోమీటర్ల కొద్ది వెళ్లి నీళ్లను తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండె. మంచినీటి ట్యాంకర్ వస్తే నీటి కోసం ముష్టి యుద్ధాలే జరిగినయ్. వానలు పడితే బస్తీలు జలమయమయ్యేటివి.తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉండె. డ్రైనేజీలు పొంగిపొర్లి, రోడ్లపై ప్రయాణం చేయలేక అనేక సమస్యలతో సతమతమైండ్రు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ నగరాన్ని అన్నివిధాలా బాగు చేసిండు. దేశ విదేశాల పర్యాటకులు పెరిగేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దిండ్రు. రహదారుల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం, ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం బ్రిడ్జిల నిర్మాణం, డ్రైనేజీ సమస్యల కోసం పైప్ లైన్‌ల రీమోడలింగ్, వర్షం నీరు సాఫీగా పోయేందుకు నాలాల విస్తరణ, సీఆర్ఎంపీ ద్వారా రహదారుల అభివృద్ధి, నగర మంతటా ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు, బస్తీల్లో పేదల కోసం మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం ఇలా లెక్కలేనన్ని అభివృద్ధి పనులు చేసిండ్రు. ఇంటింటికి పుష్కలమైన తాగునీటిని అందించి నీటి కొట్లాటలు లేకుండజేసిండు. నిరంతరం కరెంటు సరఫరా చేసి చీకట్లను దూరం చేసిండు. ఇవన్నీ ప్రజలు కళ్లారా చూస్తున్నరు. ఇవన్నీ నా గెలుపు కోసం కలిసివచ్చే అంశాలే.మోసపూరిత హామీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్, నగరాన్ని మళ్లీ పదేండ్ల నాటి ఇబ్బందుల్లో పడేసింది. పాతబస్తీ ప్రజలకు నీటి ఇబ్బందులు మొదలైనయ్.

ప్రచారంలో ప్రజాస్పందన ఎలా ఉంది?

హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎక్కడికి ప్రచారానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని చెబుతున్నారు. కరెంటు మాటిమాటికీ పోతున్నదని, మంచి నీళ్లు వస్తలేవని, డ్రైనేజీల నిర్వహణ అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నరు. బీఆర్ఎస్ పాలనే బాగుండేదని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ వెంటే ఉంటామని సంపూర్ణ మద్దతు తెలుపుతున్నరు.

మీరు గెలిస్తే ఏం చేస్తారు?

హైదరాబాద్ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ప్రజలు నన్ను గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత బాగుచేస్తా. ఇక్కడి ప్రజలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాటుపడుతా. ఇప్పటికే గోషామహల్ నియోజకవర్గంలో నిరుపేదలకు ఉచిత విద్య అందించేందుకు కృషి చేస్తున్నా. ఈ నియోజకవర్గం నుంచి పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎదగాలని నా కోరిక. ఆర్థిక సమస్యలతో విద్యకు ఎవరూ దూరం కాకుండా ఉండేందుకు సాయం చేస్తా. ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తించి విద్యాబోధన అందేలా చూస్తా. పౌర సదుపాయాలను మరింతమెరుగుపరుస్తా. ప్రజల సహకారంతో తప్పక విజయం సాధించి కుల, మతాలు, రాజకీయాలకతీతంగా హైదరాబాద్ అభివృద్ధి కోసం పనిచేస్తా.

12 స్థానాల్లో బీఆర్ఎస్‌దే గెలుపు

- దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయం
- గ్యారెంటీల పేర రేవంత్ మోసం
- కార్పొరేట్లకు దోచిపెట్టిన మోదీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కమలాపూర్/వీణవంక, మే 10: ఈ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 12 స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్‌లో, కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ప్రసంగించారు. మళ్లీ కేసీఆరే సీఎం అవుతారని చెప్పారు. కేంద్రంలో ఉన్న బీజేపీ దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఐదేండ్లు కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఒక్క పనైనా చేసిండా? ఒక్క శిలాఫలకమైన ఉన్నదా? ఒక్క బడైనా, గుడైనా కట్టిండా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఐదేండ్లలో ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణం పూర్తి చేయించని దద్దమ్మ బండి సంజయ్ అని మండిపడ్డారు. కేసీఆర్ ఉన్నప్పుడు బాగున్నదా? ఇప్పుడు బాగున్నదా చెప్పాలని కోరగా, కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె.. అంటూ ముక్తకంఠంతో చెప్పారు. 2014లో బడేభాయ్ మోదీ, 2023లో చోటే భాయ్ రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ రూ.30 లక్షల కోట్లు దోచుకున్నడని.. దోచుకున్న సొమ్ముతో అదానీ, అంబానీలకు రూ.15 లక్షల కోట్లు రుణమాఫీ చేసిండని ధ్వజమెత్తారు.

బీజేపీది మోసం.. కాంగ్రెస్‌ది ద్రోహం

- కార్మికులు, కర్షకులను ముంచిన కమలం పార్టీ
- అబద్ధాలతో ప్రజలను మోసంచేసిన హస్తం పార్టీ
- సీఎం రేవంత్ వచ్చాక సంక్షేమ పథకాలన్నీ బంద్
- బీఆర్ఎస్ ఎంపీలతోనే తెలంగాణ ఆత్మగౌరవం
- హుస్నాబాద్ రోడ్‌షోలో మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, మే 10: కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశంలోని కార్మికులు, కర్షకులు, పేద, సామాన్య ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు ఏకంగా రూ.14 లక్షల కోట్లు మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం దేశంలోని పేదల నడ్డి విరుస్తూ నిత్యావసర ధరలు పెంచిందని ఆరోపించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ రుణాలను కోట్లల్లో మాఫీచేసిన మోదీ ప్రభుత్వం పేదల రుణాలను పైసా కూడా మాఫీ చేయలేదని తెలిపారు. బీజేపీ విధానాలతో 700 మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుళ్ల బొమ్మలు పంపిణీచేసి ఓట్లు అడుగుతున్న బీజేపీకి ఓటు వేస్తే, కడుపు నిండదు అని అన్నారు. అయోధ్యలో రామాలయం కట్టింది బీజేపీ కాదని, ప్రజలు ఇచ్చిన విరాళాలతో ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయం నిర్మాణం జరిగిందని స్పష్టం చేశారు. అబద్ధాలు చెప్పడంలో రాహుల్‌గాంధీ సీఎం రేవంత్‌రెడ్డిని మించిపోయారని, ఇటీవల జరిగిన సభల్లో మహిళలకు రూ.2,500 ఇచ్చామని చెప్పడం ఆయన అవగాహనలోపానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. అబద్ధాల పునాదులపై ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే ప్రజలు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని వెల్లడించారు. హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల ఇస్తామని హామీ ఇచ్చిన ప్రియాంక గాంధీ అడ్రస్ లేకుండా పోయారని విమర్శించారు. మళ్లీ కేసీఆర్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారని చెప్పిన ఆయన.. బీఆర్ఎస్ అభ్యర్థులు ఎక్కువమంది గెలిస్తేనే తెలంగాణ ఆత్మగౌరవం నిలబడుతుందని తెలిపారు. బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్‌షోలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సిద్దిపేట జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఎంపీపీ లకావత్ మానస పాల్గొన్నారు.

- **రైతుల ఖాతాల్లో 15 రోజుల బిల్లు**

స్పందించిన విజయ డెయిరీ నిర్వాహకులు.. 'నమస్తే' కథనం ఎఫెక్ట్

నమస్తే ఎఫెక్ట్

హనుమకొండ చౌరస్తా, మే 10: విజయ డెయిరీ యాజమాన్యం పాల రైతులకు 15 రోజుల బిల్లులను చెల్లించింది. శుక్రవారం రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులను జమ చేసింది. 'పాల డబ్బులు ఎప్పుడిస్తారు' అనే శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ' మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విజయ డెయిరీకి పాలుపోసే రైతులకు ప్రతి 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాల్సి ఉండగా, 50 రోజులు దాటినా ఇవ్వడం లేదు. ఈ క్రమంలో ఈనెల 9న హనుమకొండలోని విజయ డెయిరీ డీడీ కార్యాలయంలో ఎదుట రైతులు నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తేగా స్పందించిన ఎండీ పాడిరైతుల 15 రోజుల బిల్లులు చెల్లించారు. అలాగే ఓమనైజర్ మెషీన్‌ను రిపేరు చేసి పంపించినట్టు విజయ కాకతీయ పాడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు తెలిపారు. పెండింగ్‌లో బిల్లులను కూడా చెల్లించి, 15 రోజులకోసారి పాలబిల్లులు చెల్లించి రైతులకు సహకరించాలని ఆయన డెయిరీ యాజమాన్యాన్ని కోరారు.

- **క్రిశాంక్‌కు బెయిల్**

నాంపల్లి కోర్టులు, మే 10 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) సర్క్యులర్‌కు సంబంధించిన కేసులో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఈ మేరకు నాంపల్లిలోని 8వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.25 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తును సమర్పించాలని, నెలరోజులపాటు రోజూ 12 గంటల్లోగా ఓయూ పోలీసు స్టేషన్‌కు హాజరై సంతకం చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఇందుకు సంబంధించిన ప్రతులు చంచల్‌గూడ జైలు అధికారులకు అందిన వెంటనే క్రిశాంక్ విడుదల కానున్నారు. సోమవారం జరగనున్న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో క్రిశాంక్‌కు బెయిల్ లభించడంపై బీఆర్ఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

- **ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి: జాజుల**

హైదరాబాద్, మే10 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగానికి విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎలా కల్పించారో బీజేపీ చెప్పాలని, వాటిని వెంటనే రద్దుచేసి బలహీనవర్గాలకు పంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

- **గుండెపోటుతో సెక్రటేరియట్ ఉద్యోగి మృతి**

ఐఏఎస్ వేధింపులే కారణమని సహోద్యోగుల ఆరోపణలు

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సెక్రటేరియట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాహుల్ గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. రెండురోజుల కిత్రం రాహుల్ విధుల్లో ఉండగా అకస్మాత్తుగా కిందపడటంతో వెంటనే తోటి ఉద్యోగులు నిమ్స్ దవాఖానకు తీసుకెళ్లారు. ఆయనకు డాక్టర్లు గుండె, డయాలిసిస్ శస్త్రచికిత్సలు చేసినట్టు తోటి ఉద్యోగులు తెలిపారు. ఆ తర్వాత 48 గంటల అబ్జర్వేషన్‌లో ఉంచారని, అయినా గురువారం రాత్రి 9 గంటలకు రాహుల్ మరణించినట్టు డాక్టర్లు ధ్రువీకరించారని తెలిపారు. కార్మిక, ఉపాధి కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని పేషీలో అవుట్ సోర్సింగ్ విధానంలో గత 11 ఏండ్ల నుంచి రాహుల్ పీఏగా పని చేస్తున్నారని, ఆమె ఇటీవల రాహుల్‌ను మందలించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ ఘటన జరిగి ఉంటుందని సహోద్యోగులు అనుమానాలు వ్యక్తం చేశారు.

- **ఆ మహిళను బస్సులోంచి దింపలేదు: ఆర్టీసీ**

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ) : ప్రయాణీకుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ బస్సులను నడుపుతున్నామని టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం పేర్కొన్నది. గురువారం హైదరాబాద్ లక్డీకపూల్ స్టాఫ్ వద్ద ఆర్టీసీ బస్సు నుంచి మహిళను దింపివేశారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన అంశంపై శుక్రవారం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్టు తెలిపింది. ఫుట్‌బోర్డుపై నిల్చొని ప్రయాణిస్తున్న మహిళను.. సైడ్ మిర్రర్ కనిపించేందుకు వీలుగా బస్సు లోపలికి రావాలని పలుసార్లు సూచించినప్పటికీ ఆమె వినిపించుకోలేదేని తెలిపింది. దీంతో డ్రైవర్ సత్యనారాయణ బస్సును నిలిపివేసి, లక్డీకపూల్‌లోని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారని యాజమాన్యం స్పష్టంచేసింది. మహిళను బస్సులోంచి దింపేసినట్టు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని స్పష్టంచేసింది.

- **కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా**

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): బెయిల్ మంజూరు చేయాలంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఢిల్లీ హైకోర్టు ఈ నెల 24కు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు తమకు సమయం కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపు న్యాయవాదులు కోరారు. ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను రౌస్ ఎవెన్యూ కోర్టు ఈనెల 6న డిస్మిస్ చేసిన విషయం తెల్సిందే. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కవిత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇక ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి ఈడీ అధికారులు శుక్రవారం ఏడో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. కవితతోపాటు చన్‌ప్రీత్‌సింగ్, దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అర్వింద్‌సింగ్‌ల పాత్రపై తమ వద్ద ఆధారాలున్నాయని ఈడీ పేర్కొన్నది. దర్యాప్తు కొనసగుతున్నదని, విచారణలో భాగంగా సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేస్తున్నట్టు ఈడీ వెల్లడించింది.

నేటితో ఎన్నికల ప్రచారానికి తెర

- హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ పూర్తి
- 35,809 పోలింగ్ కేంద్రాలు
- తుది దశకు చేరిన ఎన్నికల ఏర్పాట్లు

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియనున్నది. నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారపర్వాన్ని ముగించాల్సి ఉండటంతో రాష్ట్రంలోని 13 నియోజకవర్గాల్లో శనివారం సాయంత్రం 4 గంటలకు, మిగిలిన 106 నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగియనున్నది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఆసిఫాబాద్, సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, భద్రాచలం, పినపాక, ఇల్లందు, అశ్వరావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శనివారం సాయంత్రం 4 గంటలకే ప్రచారం ముగుస్తుంది. రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా హోం ఓటింగ్ ముగిసింది. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న 23,247 దివ్యాంగులతో పాటు 85 సంవత్సరాల వయసు పైబడిన వారికి ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించడంతో 21,651 మంది ఓట్లు వేశారు. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయాన్ని కల్పించడంతో 2,29,072 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 1,75,994 మంది ఓటు వేశారు. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ (ఈడీసీ) ద్వారా 34,973 మంది ఉద్యోగులు పోలింగ్ రోజున ఓటు వేయనున్నారు.

లక్షకుపైగా ఈవీఎంలు

13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగుతుంది. రాష్ట్రంలోని మొత్తం 3.32 కోట్ల మంది ఓటర్ల కోసం 35,809 పోలింగ్ కేంద్రాల్లో 1,09,941 బ్యాలెట్ యూనిట్లు, 50,135 వీవీప్యాట్‌లు, 44,906 కంట్రోల్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 50 మంది మహిళలు సహా మొత్తం 525 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

జనగామ రోడ్ షోలో తనపై విసిరిన రాయిని చూపిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పల్లా ప్రచార రథంపై రాళ్లతో దాడి

జనగామ, మే 10 (నమస్తే తెలంగాణ) : జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రచార రథంపై గుర్తుతెలియని వ్యక్తి రాళ్లు విసరడం కలకలం సృష్టించింది. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశంకు మద్దతుగా శుక్రవారం రాత్రి పట్టణంలో రోడ్‌షో అనంతరం ఆర్టీసీ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగా..ప్రచార రథంపైకి గుర్తు తెలియని వ్యక్తి రాళ్లు విసిరాడు. అవి పక్కనే ఉన్న కౌన్సిలర్ పేర్ని స్వరూప, వడ్లకొండ మాజీ సర్పంచ్ శారద, బీఆర్ఎస్ నాయకుడు రావెల రవికి తాకాయి. దీనిపై తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే పిరికిపందల్లా దొంగచాటుగా ఉండి రాళ్లు విసరడం కాదు..మేం చెప్పేది అబద్ధం అయితే ముందుకు వచ్చి మాట్లాడాలని ఆయన సవాల్ విసిరారు.

ప్రభాకర్‌రావు అరెస్టుకు వారెంట్

నాంపల్లి కోర్టులు, మే 10 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతోపాటు ఓ మీడియా సంస్థ యజమాని శ్రావణ్ అరెస్టుకు నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. పంజాగుట్ట పోలీసుల విజ్ఞప్తి మేరకు నాంపల్లిలోని 12వ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య శుక్రవారం వారెంట్లు జారీచేశారు. క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాకు వెళ్లానని, కోలుకోగానే భారత్‌కు తిరిగివచ్చి విచారణకు సహకరిస్తానని ప్రభాకర్‌రావు ఓ మెమో ద్వారా కోర్టుకు తెలియజేసినప్పటికీ ఆయన అరెస్టుకు కోర్టు వారంట్ జారీ చేసింది.

నోముల క్వార్టర్‌పై సర్కార్ వెనక్కి

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ క్వార్టర్‌కు వేసిన సీలును 48 గంటల్లోగా తొలగించాలన్న సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన అప్పీల్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. ఈ వివాదాన్ని సింగిల్ జడ్జి వద్దే తేల్చుకుంటామని ప్రభుత్వం తరపున ఏఏజీ ఇమ్రాన్ ఖాన్ చెప్పారు.

ఎంపీ అర్వింద్‌పై కేసు నమోదు

జగిత్యాల కలెక్టరేట్, మే 10 : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడంతో నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌పై కేసు నమోదు చేశామని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 8న పట్టణంలో అర్వింద్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి హిందువులకు ప్రమాదకారిగా మారాడని, జగిత్యాల పీఎఫ్ఐకి అడ్డాగా మారిందని, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారని జగిత్యాల అర్బన్, రూరల్ మండల ఎలక్షన్ ఎఫ్ఎస్‌టీ ఇన్‌చార్జి విజయేంద్రరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

మైనార్టీ గురుకులాలకు కుదింపు కుదుపు

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించారని, అందులో భాగంగా తొలుత కుదిస్తున్నట్టు చెబుతున్నారని ఆరోపిస్తున్నారు.

హైదరాబాద్‌కు సీవోఈల తరలింపు

మైనార్టీ విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు నీట్, ఎంసెట్, ఐఐటీ, జేఈఈ, లాసెట్, సివిల్స్, క్యాట్ తదితర జాతీయ పోటీపరీక్షల్లో శిక్షణ ఇచ్చేందుకు టెమ్రిస్ రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)లను ఏర్పాటు చేసింది. బాలుర కోసం రాజేంద్రనగర్, బార్కస్, సంగారెడ్డి జిల్లా కంది, అల్గోల్ కాగా, బాలికల కోసం రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, గొల్కొండలో సీవోఈలను నెలకొల్పింది. నైపుణ్యం ఉన్న ఫ్యాకల్టీ అందుబాటులో లేరని, విద్యార్థులు రావడం లేదని తదితర కారణాలను చెబుతూ ఆ సీఈవోలను కుదించేందుకు టెమ్రిస్ సిద్ధమైంది. ఇప్పటికే రాజేంద్రనగర్‌లోని సీవోఈని బార్కస్‌కు తరలించింది. అక్కడి ఫ్యాకల్టీని కూడా తొలగించింది. మొత్తంమీద 8 సీవోఈలను 4 సీవోఈలుగా కుదించి, వాటిని కూడా హైదరాబాద్ కేంద్రంగానే నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్టు సమాచారం. ఇదే విషయమైన అధికారులను సంప్రదిస్తే మెరుగైన శిక్షణ ఇవ్వడంలో భాగంగానే ఈ చర్యలు చేపట్టామని వివరిస్తున్నారు.

బీసీ నేత ఆర్ కృష్ణయ్యపై దాడి హేయం

దాడిని ఖండించిన ప్రజాసంఘాల నేతలు • దుండగులను శిక్షించాలని డిమాండ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 10: ఏపీలోని శ్రీకాళహస్తి ఏర్పేడు ఎన్నికల ప్రచారంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యపై ప్రతిపక్ష పార్టీ నేతలు భౌతికదాడులకు పాల్పడడాన్ని ప్రజాసంఘాల నేతలు శుక్రవారం తీవ్రంగా ఖండించారు. కులనిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి అభ్యర్థిగా కృష్ణయ్యను ప్రకటించిన టీడీపీ ఇప్పుడు దాడులకు ఎందుకు దిగిందో చె